ఎంపీ మాగుంటను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దారవీడు: ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఒంగోలులోని ఆయన కార్యాలయంలో మండలంలోని ఎస్.కొత్తపల్లి సర్పంచ్ వెన్నా సంజీవ రాణి శివకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు తోకల ఆవులయ్య యాదవ్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ కొత్తపల్లి, తంగిరాలపల్లి గ్రామాల్లో బస్టాండ్ నిర్మాణం, గ్రామం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీని కోరారు. ఎంపీ మాట్లాడుతూ బస్టాండ్ నిర్మాణం, గ్రామం అభివృద్ధికి తన వంతు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఎంపీని శాలువాతో ఘనంగా సత్కరించారు.

టెన్నీస్‌లో సత్తాచాటిన కోటయ్య గౌడ్


కంచర్ల కోటయ్యగౌడ్

గిద్దలూరు రూరల్: విశాఖపట్నంలో ఈ నెల 1వ తేదీ నుంచి జరుగుతున్న 65 ఏళ్ల వారికి చెందిన టెన్నీస్ టోర్నమెంట్ పోటీల్లో గిద్దలూరు రిక్రియేషన్ క్లబ్‌కు చెందిన టెన్నీస్ క్రీడాకారుడు కంచర్ల కోటయ్యగౌడ్ హైదరాబాద్‌కు చెందిన శ్యాముల్‌పై సత్తాచాటి విజయం సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మెయిన్ డ్రా ఎంపిక య్యాడు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.


డ్వాక్రా రుణ మాఫీ చెక్కు అందజేస్తున్న మంత్రి డాక్టర్ సురేష్


జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ

మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం కృషి

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాల్లో వ్యాఖ్య

సింగరాయకొండ (టంగుటూరు): రాష్ట్రంలో డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి, మహిళా సాధికారికతకు, ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు పూర్తి స్థాయిలో నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీ చేశారని తెలిపారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో శనివారం మధ్యాహ్నం జరిగిన వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాల్లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద రాష్ట్రంలో సుమారు 8 లక్షల డ్వాక్రా గ్రూపులుండగా 80 లక్షలకు పైగా లబ్ధిదారులున్నారని వీరికి సుమారు 25 వేల కోట్ల రూపాయలకు పైగా రుణ మాఫీ చేశారన్నారు. నియోజకవర్గంలో 6,057 గ్రూపులకు సుమారు 200 కోట్ల రూపాయలు రుణ మాఫీ జరిగిందన్నారు. నాలుగో విడతలో ఒక్క సింగరాయకొండ మండలంలో 1,291 డ్వాక్రా గ్రూపులు ఉండగా 12,546 మంది గ్రూపు మహిళలకు రూ. 10.07 కోట్లను రుణమాఫీ కింద అందించారని వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 2014లో అనంతపురం సభలో డ్వాక్రా మహిళల రుణాలను రద్దు చేసి వారు కోల్పోయిన బంగారు నగలు, పుస్తెలు తెచ్చి ఇస్తానని మాట ఇచ్చాడని కానీ..కేవలం ఎన్నికల సమయంలో పసుపు కుంకుమ పథకం కింద ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు అందించారని విమర్శించారు. అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేకపోతే వారి ఉసురు తగులుతుందని అందుకు చంద్రబాబే నిదర్శనమన్నారు. 2019 ఎన్నికల్లో జగన్‌పై నమ్మకంతో అక్కచెల్లెమ్మలు 175 సీట్లకు 151 కట్టబెట్టారని జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల మేనిఫెస్టోను నూరు శాతం అమలు చేశారన్నారు. కానీ చంద్రబాబు తప్పిన మాటకు శిక్షగా టీడీపీని 23 సీట్లకే పరిమితం చేశారని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో కూడా మహిళలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి కొండపిలో తన గెలుపునకు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డ్వాక్రా మహిళలకు 10.07 కోట్ల రూపాయల వైఎస్సార్ ఆసరా చెక్కులు, 2.02 కోట్ల రూపాయల స్త్రీనిధి చెక్కులు, రుణాల చెక్కులను అందజేశారు. ముందుగా పీఎంఈజీపీ లబ్ధిదారుడు వాయిల తాతయ్యకు 10 లక్షల రూపాయల విలువ గల యూనిట్‌ను అందించారు. జెడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, ఎంపీపీ కట్టా శోభారాణి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, ఏరియా కోఆర్డినేటర్ సనిత, ఎంపీడీఓ టి. నాగేష్ కుమారి, ఏపీఎం డి. జయరాజ్, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఢాకా పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్‌ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్న, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము, పలువురు నేతలు మలినేని వెంకటేశ్వర్లు, తన్నీరు సుబ్బారావు, షేక్ షకీలా, గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపూరి శ్రీనివాసులు, కొండూరి అంకయ్య, బల్లెకూర బ్రహ్మయ్య, షేక్ పటేల్, షేక్ సుల్తాన్, పఠాన్ రియాజ్, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, షేక్ కరీం, షేక్ సలీం బాషా, షేక్ సలీం, శైలజ, గొరవరపు నాగేశ్వరరెడ్డి, మహిళలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

- మరో 8 మందికి గాయాలు
- గిద్దలూరు, జరుగుమల్లి మండలాల్లో వేరువేరుగా దుర్ఘటనలు


మృతిచెందిన శ్రీనివాసులు


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

గిద్దలూరు రూరల్: రెండు వేరువేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందగా, 8 మందికి గాయాలయ్యాయి. గిద్దలూరు మండలం దిగువమెట్ట గ్రామ సమీపంలో, జరుగుమల్లి మండలం చిరికూరపాడు ఎస్సీకాలనీ వద్ద ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గిద్దలూరు మండలం దిగువ మెట్ట గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో శనివారం బియ్యపులోడు గల బొలేరో వాహనం నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. గిద్దలూరు మండలం త్రిపురాపురం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు, శిరివెళ్ల మండలం బలిజపేట గ్రామానికి చెందిన ఆసుల శ్రీనివాసులు, మరో గుర్తుతెలియని వ్యక్తి కలిపి మొత్తం 8 మంది అయ్యలూరు వద్ద గిద్దలూరు వచ్చేందుకు బియ్యపులోడు వాహనంపై ఎక్కారు. నల్లమల ఘాట్ రోడ్డు మలుపు వద్ద ప్రమాదవశాత్తూ బొలేరో వాహనానికి బ్రేకులు ఫెయిలై డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆసుల శ్రీనివాసులు (55), మరో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయాలపాలయ్యారు. వీరితో పాటుగా డ్రైవర్ నబికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సీఐ వై.వి.సోమయ్య తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పట్టణంలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

కట్టెల లోడు ట్రాక్టర్.. బైక్ ఢీకొని...


మృతి చెందిన యన్. మంజప్ప

జరుగుమల్లి: కట్టెల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను ఎదురుగా వచ్చిన యువకులు ఢీ కొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన మండల పరిధిలోని చిరికూరపాడు ఎస్సీ కాలనీ వద్ద శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో చోటు చేసుకుంది. కామేపల్లిలో బేకరీ నిర్వహించే ముగ్గురు యువకులు మోటారు బైకుపై టంగుటూరు నుంచి కామేపల్లి వెళుతున్నారు. చిరికూరపాడు ఎస్సీ కాలనీ వద్దకు రాగానే.. కామేపల్లి నుంచి టంగుటూరు వైపు కట్టెల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా వచ్చింది. రాత్రి సమయం కావడంతో కట్టెల లోడు కనిపించక వాటిని బైక్ ఢీకొట్టింది. దీంతో అపాచి మోటారు బైకు నడుపుతున్న యన్.మంజప్ప (36), వెనుక కూర్చున్న కె.వై విజేత (28) ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వీరి మధ్యలో కూర్చున్న వి.రఘువీర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది మృతదేహాలను, క్షతగాత్రుడిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కాగా మృతులు, క్షతగాత్రునిది కర్ణాటక రాష్ట్రంలోని పగాచి పలాలే అనే ప్రాంతంగా తెలిసింది. ట్రాక్టర్ నడిపిన డ్రైవర్ పరారీలో ఉన్నాడు. జరుగుమల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

మార్కాపురం రూరల్: ఉపాధి హామీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ సీనారెడ్డి శనివారం హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తిప్పాయిపాలెం, మాల్యవంతునిపాడు, నాయుడుపల్లి, నికరంపల్లి, బోడపాడు తదితర గ్రామ పంచాయతీల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. సుమారు 40 వేల రూపాయలు ఫీల్డు అసిస్టెంటు నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, ఎంపీడీఓ చందన, విజిలెన్స్ ఆఫీసర్ ఝాన్సీ రాణి, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్ సుబ్బారావు, ఏపీఎం జీవరత్నం పాల్గొన్నారు.

రజక సంఘ అధ్యక్షుడిగా బాలచెన్నయ్య

గిద్దలూరు రూరల్: కొంగలవీడు రోడ్డు మడియాలేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన రజక సంఘ నూతన కార్యవర్గ సమావేశంలో రజక సంఘం అధ్యక్షుడిగా బాలచెన్నయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పెద్ద ఖాదరయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని సంఘ నాయకులు అభినందించారు.

10న డివిజన్ స్థాయి పాటల పోటీలు

మార్కాపురం: ఘంటసాల వర్ధంతి సందర్భంగా స్థానిక త్రివిక్రమ అభ్యుదయ కళాసంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిఫంక్షన్ హాలులో ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి డివిజన్ స్థాయి పాటల పోటీలను బాల బాలికలకు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి చిత్తారి రంగనాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల గాయకులు 94408 44985, 95058 08242 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సాయిచైతన్య డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ సాయిచైతన్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 5వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ డిప్లొమో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్లకు ఘన సన్మానం


షంషేర్, పీఎల్‌పీ, మక్బుల్‌బాషాలను సన్మానిస్తున్న ముస్లిం సంఘాల నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మీర్జా షంషేర్ అలీబేగ్, డైరెక్టర్లు మక్బుల్ బాషా, పీఎల్‌పీ యాదవ్‌లను శనివారం సాయంత్రం కార్యాలయంలో జమాతే ఇస్లామీ హింద్, ఎస్ఐఓ, ఐవైఎం నాయకులు ఘనంగా సన్మానించారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ముస్లిం సంఘాల నాయకులు అష్రఫ్ అలీ, సికిందర్, ఖాలీద్, ఇస్మాయిల్, నజీర్, మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- కలెక్టర్ దినేష్‌కుమార్


ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై శనివారం స్థానిక ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేసి పక్కాగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 69 పరీక్ష కేంద్రాల్లో 44,733 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. వారిలో 21,570 మంది మొదటి సంవత్సరం, 23,163 మంది రెండో సంవత్సరం విద్యార్థులు ఉన్నారన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా తెలియపరచాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీటింగ్, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాలు తరలించేందుకు రవాణా శాఖ అధికారులు తగిన వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు పూర్తయిన తర్వాత సమాధాన పత్రాలను సీల్డ్ కవర్‌లో పోస్టల్ శాఖకు అందజేయాలన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జెరాక్స్, ఇంటర్‌నెట్ కేంద్రాలను మూసివేయాలన్నారు. అంతేగాకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. స్క్వాడ్ చురుగ్గా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఆర్ఐఓ సైమన్ విక్టర్, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, వైద్యారోగ్య, విద్యుత్, తపాలా, ఖజానా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాయకులంతా కలిసికట్టుగా పని చేయాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: వైఎస్సార్ సీపీ నాయకులంతా కలిసి కట్టుగా పని చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక బూచేపల్లి నివాసంలో మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రధాన నాయకులతో శనివారం వారు సమావేశమయ్యారు. వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రతి నాయకుడు బూత్ లెవల్‌లో ఉన్న కార్యకర్తలను కలుపుకుని ఎన్నికలకు సిద్ధం చేయాలన్నారు. తాము కలవలేకున్నా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి సమన్వయం చేసుకుందామని చెప్పారు. ప్రతి నాయకుడు, కార్యకర్త జగనన్న గెలుపునకు ఎంత కష్ట పడతారో ఆ తర్వాత అందరికీ అంతే మేలు జరుగుతుందని చెప్పారు. తమకు ఎటువంటి అవసరాలు ఉన్నా నేరుగా తనను కలిసి మాట్లాడండని సూచించారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, ఎంపీపీ గోళ్లపాటి సుధా అచ్చయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, గర్నెపూడి సామ్యేల్, దామెర్ల రామ్మోహన్, అంకబాబు, మజ్జువలి, పుట్ట రవి, చెరుకూరి జగన్, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, యరమల మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఖైదీల పట్ల అంకిత భావంతో ఉండాలి


ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి శ్యామ్‌బాబు

గిద్దలూరు రూరల్: ఖైదీల పట్ల అంకిత భావంతో పనిచేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యామ్‌బాబు అన్నారు. పట్టణంలోని సబ్ జైలును ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడారు. జైలులో ఉండే 18 నుంచి 22 సంవత్సరాల లోపు ఖైదీలను గుర్తించేందుకు ఆయన వచ్చిన సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. ఖైదీల పట్ల అధికారులు అంకిత భావంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. వారికి కల్పిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీల కేసుల వివరాలు కుటుంబ నేపథ్యం వంటి వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రికార్డులు, వస్తువుల స్టాకు గదులు పరిశీలించారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, పారా వలంటీర్ మధు ఉన్నారు.

మోస పూరిత మాటలు నమ్మవద్దు


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

దొనకొండ: గ్రామాల్లోని ప్రజలు కొత్త వ్యక్తుల మోసపూరిత మాటలు నమ్మ వద్దని, గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని త్రిపురాంతకం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సుబ్బారావు సూచించారు. నూతనంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు పొందిన తర్వాత దొనకొండ పోలీస్‌స్టేషన్‌కు శనివారం విచ్చేసి సిబ్బందికి సూచనలు, సలహాలందించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల ప్రజలు ఆన్‌లైన్‌లో రుణాలు తీసుకోవద్దని, దాని వలన ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. మీ పొలం సర్వే నంబర్, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్‌తో మీకు ఇబ్బందులు గురి చేస్తారన్నారు. యాక్సిడెంట్ జోన్‌లు పరిశీలించి తగ్గుముఖం పట్టేలా పలు సూచనలు చేశామన్నారు. త్వరలో ఎన్నికలు జరుగుతాయని, సిబ్బంది జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

జలజీవన్ పనులు సకాలంలో పూర్తి చేయించాలి


అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: జలజీవన్ పథకంలో మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేయించాలని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశం హాలులో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో మంచి నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచనలు ఇచ్చారు. నారువానిపల్లె, పిటికాయగుళ్లలో పూర్తిగా శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని పడగొట్టకుండా ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశముందని సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల కాంపౌండ్ గోడల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈఓ రమణారెడ్డి తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ నుంచి సర్టిఫికెట్ తీసుకుని శిథిలావస్థకు చేరిన పాఠశాల గదులను తొలగిస్తామని ఎంఈఓ తెలిపారు. బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్ కాంపౌండ్ వాల్ ముందు భాగంలో రోడ్డు విస్తరణలో తొలగించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల ఉపాధ్యక్షుడు ఖాజామీయా తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎంపీడీఓ పార్వతి, డీటీ జితేంద్రకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై దృష్టి సారించాలి


ప్రశంసపత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అర్థవీడు (కంభం): గ్రామాల్లో నీటి సమస్యపై దృష్టి సారించాలని ఎంపీపీ వెంకట్రావు అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పలు గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని అడుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది పని తీరు సక్రమంగా లేదని సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కోరారు. ఇటీవల ఉత్తమ జూనియర్ అసిస్టెంట్‌గా ప్రశంసపత్రం అందుకున్న కళ్యాణిని అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజేతలుగా నిలిచిన కబడ్డీ, ఖోఖో క్రీడాకారులకు ప్రశంసపత్రాలు, మెడల్స్ అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ, ఎంపీడీఓ మస్తాన్ వలి, మండల కన్వీనర్ చేగిరెడ్డి పోతిరెడ్డి, నన్నెబోయిన రవికుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతలు స్వీకరించిన సోమయ్య

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అర్బన్ సీఐగా వైవీ సోమయ్య శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. చట్టం దృష్టిలో అంతా సమానమేనన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుంటూరు వెళ్లి పింఛను అందజేత


గుంటూరులో పింఛను అందిస్తున్న వలంటీర్ రవితేజ

తర్లుపాడు: మండల కేంద్రానికి చెందిన పులుకూరి మేరమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో గుంటూరులో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న క్లస్టర్ వలంటీర్ రవితేజ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి మేరమ్మకు పింఛను అందచేశారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ పి. వరాలు, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ అంకమ్మ, వెల్ఫేర్ అసిస్టెంటు శ్రీధర్ అభినందించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మార్కాపు రంరూరల్: చదవడం ఇష్టంలేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. యర్రగొండపాలెం మండలం పీఆర్‌సీ తండా గ్రామానికి చెందిన దేవాసుత్ జానకీ బాయి మార్కాపురం మండలం దరిమడుగులో ఉన్న నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ చదువుతోంది. కళాశాల హాస్టల్‌లో భోజనం సరిగాలేదని.. చదవడం ఇష్టం లేక కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు. తీవ్రగాయాలైన యువతిని వినుకొండకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

- ప్రజల అవసరాలపై వెంటనే స్పందించాలి
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: నియోజకవర్గ అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో శనివారం వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ తమ గ్రామాల్లో సమస్యలపై చర్చించారు. బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో తాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. నియోజకవర్గంలో పలు కారణాలతో ఆగిపోయిన పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరిన పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. దర్శి పట్టణంలో ఇంటింటికీ కుళాయి పనులు వెంటనే మొదలు పెట్టాలని ఆదేశించారు. గంగవరం-తాళ్లూరు రోడ్డు పనులు, కురిచేడు-పొట్లపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎస్సీ,బీసీ కాలనీల్లో విద్యుత్ పోల్స్ అవసరం అయితే జెడ్పీ నిధులతో మంజూరు చేస్తామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు చెప్పిన ప్రతి పనిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పెండింగ్ లేకుండా చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో లోటట్టేజీ సమస్యలు ఉన్న చోట విద్యుత్ ట్రాన్స్‌ఫర్మర్‌లు, ప్రత్యేక లైన్‌లు ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేషన్‌లు వేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీలు, తమ సొంత ప్లాట్లలో ప్రభుత్వం అందిస్తున్న నివాసాలు ఏర్పాటు చేసుకునే వారికి అధికారులు తమకు కావాల్సిన ఇసుక, సిమెంట్ వంటి మెటీరియల్‌లు, వారికి చెల్లించాల్సిన బిల్లుల్లో లోపాలు అధిగమించి, నివాసాలు పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీ, ఈఈ శ్రీనివాసరావు, డీఈ రంగారావు, ఆర్‌అండ్‌బీ డీఈ కృష్ణ, పంచాయతీ రాజ్ డీఈ విఠల్‌రాథోడ్, విద్యుత్ ఈఈ ఎస్‌కే కరీం, డీఈ పిచ్చయ్య, ఎంపీపీ సుధాఅచ్చయ్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం బాషా, వైస్ ఎంపీపీలు కొరివి ముసలయ్య, సోము దుర్గారెడ్డి, ఎంపీడీఓ హనుమంతరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

నేడు తాటిపర్తి పర్యటన

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాలలో యర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం పర్యటించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి, వెలుగు ఏపీఎం దర్శనం పోలయ్య తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల కేంద్రంలోని శివసదనం అతిథి గృహంలో జరిగే ఆసరా 4వ విడత కార్యక్రమంలో తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. డ్వాక్రా గ్రూపు మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారని చెప్పారు. అంతకు ముందు సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయం ఎదుట ఉదయం 10 గంటలకు జరిగే ఆత్మీయ సమావేశంలో తాటిపర్తి పాల్గొంటారని మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి అభిమానులు, కార్యకర్తలుభారీగాహాజరుకావాలనిఆయన పిలుపునిచ్చారు.

ప్రజల అభిమానాన్ని ఎన్నటికీ మరువలేను

- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు


ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గ ప్రజల అభిమానం, ఆప్యాయతలు ఎన్నటికీ మరువలేనని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'నా రాజకీయ జీవితానికి ఆయువును ఇచ్చి, 15 ఏళ్లుగా నన్ను ప్రతి దశలో ఆదరించి, అభిమానించిన నియోజకవర్గ ప్రజానీకానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. నాది రాజకీయ జీవితమే అయినా గిద్దలూరు ప్రజానీకంతో విడదీయలేనంత బంధం పెనవేసుకుంది. నా కష్టసుఖాల్లో మీరు, మీ కష్ట సుఖాల్లో నేను భాగస్వాములమయ్యా. రాజకీయ వ్యూహాల్లో భాగంగా జరిగిన నిర్ణయంతో నాతో పాటు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఒకింత భావోద్వేగానికి గురవుతాం. కానీ పార్టీ ప్రయోజనాలు, భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధినేత జగనన్న నిర్ణయాన్ని మనందరం స్వాగతించాల్సిన అవసరంఉంది. జగనన్న నిర్ణయాన్ని మనం ఆదరిస్తే నేడు మనదే, భవిష్యత్ మనదే అవుతుంది. జగనన్న పిలుపు మేరకు సిద్ధం అవుదాం. నియోజకవర్గ ప్రజలు 15 ఏళ్లుగా అండగా నిలిచారు, అందరికీ ఒక్కమాటలో కృతజ్ఞతలు చెప్పలేను.. ఎల్లప్పుడూ కృతజ్ఞుడనే..మిమ్మల్ని ఎప్పటికి మరువను. మీకు ఎప్పటికి నా సేవలు అందుతాయి' అని పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

కంభం చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోండి

మార్కాపురం: ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన కంభం చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు శనివారం బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కంభం చెరువుకు మరమ్మతులు చేసి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు వినతిపత్రంలో కోరారు. వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న చెరువుకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. రమేష్‌రెడ్డి, శ్రీధర్, బొంతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

కొనకనమిట్ల: జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని, లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కనిగిరి ఆర్‌డీఓ జాన్ ఇర్విన్ సూచించారు. శనివారం గొట్లగట్టు సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. జగనన్న లేఅవుట్‌లో ఎన్ఎంఐ ద్వారా రిజర్వేషన్ అయ్యేలా సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, పంచాయితీ సెక్రటరీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తహసీల్దార్ సాజీదా, వీఆర్‌ఓ దిలీప్‌కుమార్ ఉన్నారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌డీఓ